# [illegible]

**-సుబ్బారాయుడు కలగోట్ల**

"ఓరేయ్...సుందరమ్" వరండాలోంచి నాన్న పిలుపు విన్పించింది.

"ఇదిగో...వస్తున్న" అంటూ బదులిచ్చాను.

శ్రీమతి అందించిన అన్నం కారియర్ తీసుకొని బయటకొచ్చి "ఏమిటి నాన్నా?" అని అడిగాను. వరండాలో మంచంపై కూర్చుని పుస్తకం తిరగేస్తున్న నాన్న మెల్లగా తలెత్తి "డాక్టర్ రాసిచ్చిన కళ్లద్దాలురా..." అంటూ మధ్యలో ఆపుచేసి ఆశగా నా వంక చూశాడు.

నేను విసుగ్గా మొఖం పెట్టి "నెల చివర్లో ఇప్పుడెలా నాన్నా? జీతాలు రానీ తెస్తా నన్నానుగా" అన్నాను అసహనంగా.

ఒక్కసారిగా గాలి తీసిన బెలూన్‌లా అయిపో యింది నాన్న ముఖం. "ఎక్కడరా నాకు చూపులు అసలే ఆనడం లేదు. కళ్లద్దాలైనా తెస్తే ఏదో కాలక్షే పానికి ఈ రామాయణం, భారతాలైనా చదువుకుం దామనిరా... నువ్వేమో నాలుగు నెల్లన్నుంచి ఇదే మాట చెప్పూనే ఉన్నావు" అన్నాడు నీరసంగా.

"నేను మాత్రం ఏం చేసేది చెప్పు. నిన్నటి నెల్లో బుజ్జిగాడి స్కూల్ ఫీజు కట్టాల్సి వచ్చింది. మొన్నటి నెల్లో కరెంటు బిల్లు కట్టాల్సొచ్చింది. ఇలా ప్రతీ నెలా ఏదో ఒకటి అడ్డు తగులుతుంటే నీకు మళ్లీ కళ్ల ద్దాలు ఎక్కడి నుంచి తెచ్చి పెట్టను. కొద్ది రోజులు ఆగు. డబ్బు సర్దుబాటు చూసుకుని తెస్తానన్నా నుగా" అంటూ సైకిల్ కిందికి దించి కారియర్ హాండిల్‌కు తగిలించుకుని స్కూల్‌కు బయలుదే రాను. వయసు పైనబడటంతో నాన్నకు చూపు మందగించింది. డాక్టర్‌కు చూపిస్తే కళ్లద్దాలు రాసి చ్చారు. ఎప్పటికప్పుడు కళ్లద్దాలు కొందామనే అను కుంటున్నాను. కానీ వీలు పడటం లేదు. నాన్న ఈ మధ్య ఒంటరితనం ఎక్కువగా ఫీలవుతున్నాడు. ఏడాది క్రితం అమ్మ పోవడంతో మరీ ఒంటరివాడై పోయాడు. బయటికెళ్లి ఎవరితోనైనా కలుద్దామంటే కీళ్లనొప్పులతో కదలలేనితనం ఇబ్బంది పెడు తోంది. అందుకే ఇంట్లో కూర్చుని పురాణ గ్రంథాలు తిరగేస్తూ శేష జీవితాన్ని వెళ్లబుచ్చుతున్నారు. వచ్చే నెలలోనైనా కళ్లద్దాలు తేవాలంటే వరలక్ష్మీవ్రతం ఒకటి వచ్చి పడింది. ఆలోచనల్తో స్కూల్‌కి చేరుకు న్నాను. మధ్యాహ్నం చివరి పిరియడ్‌లో క్లాస్ చెపు తుండగా ప్యూన్ వచ్చి ఓ సర్క్యులర్ అందించాడు. అది చదివి పిల్లల వంక చూశాను. వాళ్లంతా చాలా ఉత్సుకతతో నా వంక చూడసాగారు.

"ఒరేయ్ పిల్లలూ...ఎవరో సర్కస్ వాళ్లు వచ్చా రంట. వాళ్లేదో సర్కస్ చేసి చూపిస్తారంట. మీకు తోచింది చిల్లర డబ్బులివ్వండి. లాస్ట్ పీరియడ్ అవ గానే మీరంతా గ్రౌండ్‌లోకి వెళ్లండి" అన్నాను.

పిల్లల ముఖాల్లోకి ఒక్కసారిగా సంతోషంతో కూడిన వెలుగొచ్చింది.

"ఒరేయ్ రామూ! నువ్వు లేచి అందరి దగ్గరా డబ్బులు వసూలు చేయ్" అంటూ ఆర్డర్ వేశాను.

రాము లేచి డబ్బులు కలెక్ట్ చేయసాగాడు. పిల్ల లంతా ఉత్సాహంగా తమ దగ్గరున్న చిల్లర ఇవ్వసా గారు. క్లాస్‌రూమ్‌లో గుసగుసలు మొదల య్యాయి. రామూ కలెక్ట్ చేసిన డబ్బు నా చేతికి తెచ్చి ఇచ్చాడు. లాంగ్ బెల్ కొట్టగానే పిల్లలంతా బిలబిలమంటూ గ్రౌండ్‌లోకి పరుగులు తీశారు. అప్పటికే సర్కస్ వాళ్లు అక్కడ వాళ్ల సరంజామాతో సిద్ధంగా ఉన్నారు. పిల్లలంతా వెళ్లి సర్కస్ వాళ్ల చుట్టూ వృత్తాకారంలో కూర్చున్నారు. పదవ తర గతి పిల్లలు వెళ్లి ఓ వైపున కుర్చీలు సర్దారు. మాస్టా ర్లంతా వెళ్లి కుర్చీల్లో కూర్చున్నాము.

మధ్యలో సర్కస్ వాళ్లు ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ల వంక పరిశీలనగా చూశాను. వాళ్లల్లో ఒక వ్యక్తి జీన్స్ ప్యాంట్, దానిపైకి పచ్చని బనియన్ వేసుకొని ఉన్నాడు. చేతిలో చెర్నోకోల పట్టుకొని అటూ ఇటూ తిరుగుతు న్నాడు. సర్కస్ పెద్దలా ఉన్నాడు. నల్లగా, బలి ష్టంగా ఉన్నాడు. నాలుగు పదుల వయసుంటుంద నుకుంటాను. మరోపక్క పరిచిన ఓ దుప్పటిపై ఓ యువతి కూర్చుని ఉంది. పంజాబీడ్రెస్ వేసుకొని ఉంది. అది బాగా మాసిపోయి ఉంది. తన ముందున్న డప్పును సిద్ధం చేసుకుంటుంది. ఆమె పక్కనే పాలు తాగే పసికందు నిద్రపోతున్నాడు. ఆ పక్కనే మరో ఐదుమంది అబ్బాయిలున్నారు. అంతా పది నుంచి పదిహేను ఏళ్ల లోపువాళ్లే. వాళ్లు ధరించిన దుస్తులు బాగా మట్టికొట్టుకుపోయినట్టు న్నాయి. వాళ్లంతా తిండి లేక ఎండిపోయిన వాళ్లలా గున్నారు. వాళ్లల్లో ఒకడు ముఖానికి తెలుపు, ఎరుపు రంగు పూసుకున్నాడు. పీలికలు, పీలిక లుగా చిరిగిన దుస్తులు వేసుకున్నాడు. బఫూనులా తయారై ఉన్నాడు.

సర్కస్ పెద్ద బడిపిల్లలను చప్పట్లు కొట్టమ న్నాడు. పిల్లలంతా హుషారుగా చప్పట్లు కొట్టసా గారు. అంతలో ఆ ఆడమనిషి డప్పువేయడం మొదలెట్టింది. ఐదుగురు సర్కస్ పిల్లలు లేచి అంద రికీ అభివాదం చేయసాగారు. పిల్లల చప్పట్ల మధ్య డప్పుహోరు మధ్య సర్కస్ మొదలైంది.

సర్కస్ పెద్ద, వాళ్ల పిల్లలు చేయబోయే ఫీట్స్ గురించి ముందుగా వివరణ ఇవ్వసాగాడు.

ఆ వెంటనే పిల్లలు ఒక్కొక్కరే వచ్చి రకరకాల ఫీట్స్ ప్రదర్శించి వెళుతున్నారు. ముందుకు, వెనక్కి పల్టీలు కొడుతున్నారు. శరీరాన్ని రకరకాల భంగిమల్లో వంచి ప్రదర్శిస్తున్నారు.

వాళ్లు చేసే ఫీట్స్ చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వాళ్ల శరీరంలో అసలు ఎముకలే లేవా అనిపించింది. మరో వైపు ఆ పిల్లలను చూస్తుంటే బాధగా అనిపించింది. అంతా బాల్య దశలో ఉన్న వాళ్లే. ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యమంతా పొట్ట కూటి కోసం తమ శరీరాలన కష్టపెట్టుకోవాల్సి రావడం బాధగా తోస్తుంది.

బడిపిల్లల వంక చూశాను. బడిపిల్లలు వాళ్ల ప్రదర్శించే ఫీట్స్‌ను ఎంతో సంబరంగా, ఉత్సా హంగా చూస్తూ చప్పట్లు చరుస్తూ ఎంజాయ్ చేస్త న్నారు. మరోపక్క అదే ఈడు పిల్లలు బడిపిల్లల మెప్పు కోసం, వాళ్లను ఉత్తేజపరచడం కోసం తమ శరీరాల్ని కష్టపెట్టుకుంటూ జీవితంలో సర్కస్ చేస్త న్నారు. వీరిద్దరి మధ్యా ఎంతటి వ్యత్యాసం ఉంది అనిపించింది. మధ్యమధ్యలో బఫూన్ వేషగాడు సర్కస్ ఫీట్స్‌ను కావాలనే తప్పుగా చేస్తున్నాడు. సర్కస్ పెద్ద, అది చూసి వాడిని చెర్నోకోలతో కొడుతున్నాడు. వాడు దెబ్బలు తింటూ 'అబ్బా...అబ్బా' అంటూ బాధను నటిస్తూ హాస్యాన్ని పండిస్తున్నాడు. అది చూసి బడిపిల్లలు కిలకిలమని నవ్వుతున్నారు. సంతోషంతో తుళ్లిపడు తున్నారు. అమ్మా నాన్నలు కొనుక్కోమని ఇచ్చిన డబ్బుతో వినోదాన్ని పొందుతున్నారు. వాళ్ల ముఖాల్లో పరిమళిస్తున్న ఆనందాన్ని చూస్తుంటే నాకు నా చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి.

ఇలాంటి ఎన్నో సంబరాలు, సంతోషాలతో నా బాల్య జీవితం ముడిపడి ఉంది. ఆటపాటలతో సర దాగా గడిచిపోయింది నా బాల్యం. అమ్మానాన్న లకు నేనొక్కడినే సంతానం కావడంతో నన్నెంతో అల్లారుముద్దుగా పెంచారు. ప్రతీరోజు బడికెళ్లేట ప్పుడు డబ్బులు ఇచ్చి పంపేవారు. ఎప్పుడైనా

డబ్బుల్లేవంటే బడికెళ్లనని మారాం చేసేవాడిని.

"చిల్లర లేదయ్యా... ఈ రోజుకొక్కరోజుకు ఎలాగోలా వెళ్లవయ్యా" అని నాన్న ఎంత చెప్పినా వినేవాడిని కాదు. చిల్లర జేబులో పడందే బడికెళ్లేవాడిని కాదు. అంతలో సర్కస్‌లో మరో ఫీట్ ప్రదర్శిస్తున్నారు. ఓ అబ్బాయి పూర్తిగా వెనక్కి వంగి చేతులు నేలకు ఆనించాడు. మిగతా ముగ్గురు పిల్లోళ్లు చాలా లాఘవంగా అతని పొట్టపైకి ఎక్కి ఒకరి చేతులు ఒకరు పట్టుకొని నిల్చున్నారు. వెల్లకిల వంగిన అబ్బాయి ఆ ముగ్గురి బరువును కేవలం తన పొట్టపైన మోస్తున్నాడు. చూస్తున్న బడిపిల్లలు మారుమోగే చప్పట్లతో అభినందనలు తెలుపుతున్నారు. మాస్టర్‌లు 'ఎక్సలెంట్ ఫీట్' అంటూ ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. నాకు మాత్రం ఆ ఫీట్‌ను చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. జానెడు పొట్ట నింపుకోవడం కోసం అదే పొట్టపైన తన శక్తికి మించిన బరువును మోయడం కదిలించివేస్తోంది. సర్కస్ ముగింపు దశకు చేరుకుంది. చివరి ఫీట్ మాత్రం నన్ను విపరీతంగా కలవరపెట్టేసింది. అంతవరకూ ఆడమనిషి పక్కన పడుకున్న ఆ చంటి పిల్లాడిని తట్టి లేపి తన చేతుల్లోకి తీసుకున్నాడు సర్కస్ పెద్ద. తన అరచేతిలో ఆ పిల్లాడి కాళ్లను గట్టిగా పట్టుకొని చేతిని పైకెత్తి గాలిలో ఆ పిల్లాడిని అలా నిలబెట్టేశాడు.

అందరూ ఉత్కంఠతో ఆ దృశ్యాన్ని వీక్షిస్తున్నారు. ఒక్కసారిగా ఆ సర్కస్ పెద్ద పిల్లాడిని గాలిలో గిరగిరా తిప్పాడు. బడిపిల్లలంతా ఊపిరి బిగబట్టి ఆ దృశ్యాన్ని తిలకించసాగారు. నాకు విపరీతమైన భయం వేసింది. ఫీట్ పూర్తికాగానే ఆ ప్రదేశమంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

ఆ దృశ్యం భరించరానిదిగా తోచింది నాకు. పాలు తాగి తల్లి ఒడిలో సేదతీరాల్సిన ఆ పిల్లాడు తను తాగే పాలు సైతం సంపాదించుకోవాల్సి వస్తోంది అనిపించింది. సర్కస్ ముగిసింది. బడిపిల్లలు సంతోషంగా ఇంటి దారి పట్టారు. సర్కస్ వాళ్లు తమ సరంజామా సర్దుకోసాగారు. ఉపాధ్యాయులంతా వెళ్లి ఆఫీసు రూంలో కూర్చున్నాము. కాసేపటికి సర్కస్ పెద్ద ఆఫీసు రూంకొచ్చి స్కూల్లో కలెక్ట్ చేసిన డబ్బు తీసుకొని మా వద్ద సెలవు తీసుకున్నాడు. మాస్టార్లమంతా సర్కస్ గురించి చర్చించుకోసాగాము. అంతలో సర్కస్ వేసిన పిల్లల్లో అందరికంటే వయసులో చిన్నవాళ్లయిన ఇద్దరు మాత్రమే ఆఫీసు రూమ్ దగ్గరకొచ్చి బయట నిల్చున్నారు.

"ఏంరా...మళ్లీ ఇలా వచ్చారు?" అన్నారు హెడ్మాస్టర్ వాళ్ళను చూడగానే.

వాళ్లు దీనంగా ముఖాలు పెట్టి "ఏదన్నా చిల్లరుంటే ఇవ్వండి సారూ..." అంటూ మాకు దండాలెట్టారు.

"ఇప్పుడే కదరా మీ నాన్న వచ్చి డబ్బులు తీసుకెళ్లాడు" అన్నాడు హెడ్‌మాస్టార్ మందలింపుగా.

"మా అయ్య మాకు పైసలివ్వడు సారూ" అన్నారు పిల్లలు.

"మీకివ్వకుండా ఆ డబ్బులతో మేడలు, మిద్దెలు కడతాడేంట్రా మీ అయ్య" ఓ మాస్టారు వేసిన చీప్ జోక్‌కు తోటి ఉపాధ్యాయులంతా కిసుక్కున నవ్వారు. కానీ నాకు మాత్రం నవ్వు రాలేదు.

"లేదు సారూ... ఆ పైసలతో మా అయ్య సారా తాగుతాడు సారూ" అన్నారు పిల్లలు.

సూటిగా వాళ్ల ముఖాల్లోకి చూశాను. అమాయకత్వం నిండిన ఆ ముఖాలను చూస్తుంటే జాలి వేసింది. ఆ పసిబిడ్డల శ్రమను దోచుకొని సారా మత్తులో పడి బాధ్యతలను విస్మరిస్తున్న ఆ కన్న తండ్రి మీద అసహ్యం వేసింది.వెంటనే నాకు మా నాన్న గుర్తొచ్చాడు. కుటుంబాన్ని పోషించటానికి ఆయన పడ్డ కష్టాలు కళ్లముందు కదలాడాయి. ఆయన గాజుల వ్యాపారం చేసేవారు. పల్లెపల్లె తిరిగి గాజులు అమ్మేవారు. చీకట్లో ఇంటి నుంచి బయట పడి పొద్దు గూకే వేళకు ఇంటికి చేరుకునేవాడు. ఇంట్లో ఎన్ని ఇబ్బందులున్నా ఏనాడూ నా సంబరాలకు, సంతోషాలకు అడ్డు చెప్పలేదు నాన్న. ఉన్నట్టుండి నాకో సంఘటన గుర్తొచ్చింది. అప్పుడు నేను ఇంటర్ సెకండియర్ చదువుతున్నాను. కాలేజీ వాళ్లు విహారయాత్ర ప్లాన్ చేశారు. నేను కూడా వెళ్లాలనుకున్నాను. ఆ విషయమే నాన్నకు చెప్పాను. కానీ ఇంట్లో ఆర్థికంగా ఇబ్బంది ఉంది. నాన్న నా కోసం అప్పు చేసి ఐదు వందలు తీసుకొచ్చి నా చేతిలో పెట్టారు. ఆ సంఘటన గుర్తు రాగానే నా కళ్లు చెమ్మగిల్లాయి. ఆ సాయంత్రం నేను సరాసరి ఇంటికెళ్లలేదు. బజారుకెళ్లాను. నా సహోపాధ్యాయుడి దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బు పెట్టి నాన్నకు కళ్లజోడు కొన్నాను.

